విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 31 అక్టోబరు 2025 8 పేజీలు

కన్నీటిని మిగిల్చిన 'మొంథా'

- ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న గ్రామాలు
- ఇప్పటికీ పలు కాలనీలు నీటిలోనే
- పంట నష్టపరిహారంపై అంచనా
- సహాయక చర్యల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాపై మొంథా తుపాను కన్నీటిని మిగిల్చింది. లైలా తుపాను కన్న ఎక్కువ స్థాయిలో మొంథా తుపాను జిల్లాకు భారీ నష్టాన్ని మిగిల్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా అతలా కుతలమైంది. నేటికీ అనేక గ్రామాల చుట్టు నీరు తగ్గలేదు. ఎగువ నుంచి వర్షపునీరు ఉధృతి ప్రవహిస్తూనే ఉంది. చెరువులు, వాగులు, వంకల్లో నీరు ప్రవహిస్తున్నాయి. గురువారం వర్షం పడకపోవడంతో అధికార యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముంపు బాధితుల సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వాతావరణ ప్రభావంతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల నుంచి ఇప్పుడిప్పుడే జనాలు సొంత ఇళ్లకు వెళున్నారు. అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు ముంపు గ్రామాలను పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలపై మొంథా ప్రభావం చూపించింది. వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. సుమారు 15 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిని ఉంటాయని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. వీటి నష్టం ఏ మేరకు ఉంటుందన్న దానిపై నేడు, రేపు వ్యవసాయాధికారులు పంట నష్టం వేయనున్నారు. గుండ్లకమ్మ గేట్ల ద్వారా నీటిని సముద్రానికి వదులుతున్నారు. వాగులు, వంకలు ఇంకా పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పోలీసులు జనాలను రోడ్లు దాటిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. గురువారం ఉదయం రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్‌తో కలిసి పునరావాస కేంద్రాల్లో బాధితులకు బియ్యం, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల

మిగతా 2 లో ...

ముందస్తు ప్రణాళికతో 'మొంథా'ను

సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

విశాలాంధ్ర -ఒంగోలు : ముందస్తు ప్రణాళికతో మొంథా తుఫాన్‌ను ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు అయిందన్నారు. 2025 అక్టోబర్ 28వ తేదీన ఉదయం 8:30 నుండి 29వ తేదీ ఉదయం 8 గంటల వరకు జిల్లాలో సగటున 18.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని, అందులో ఒంగోలులో 25.72 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది అన్నారు. 2010లో వచ్చిన లైలా తుఫాన్ కన్నా ఇప్పుడు వచ్చిన మొంథా

మిగతా 2 లో ...

'మొంథా'తో నష్టపోయిన రైతాంగానికి
సత్వర పరిహారం
3 లో..

నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

- ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - కొల్లూరు : మొంథా తుఫాన్‌కి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొల్లూరు, పెద లంక, చింతలంక, ఈపూరు లంక,సుగ్గన లంక, చిలుమూరు లంక,గ్రామాలలో పర్యటించి తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి, అరటి, బొప్పాయి, తమలపాకు పంటలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎనీమరేషన్ ప్రారంభించాలని వాస్తవ సాగుదారులను గుర్తించాలని

మిగతా 2 లో ...

ఏసీబీ వలలో అటవీశాఖ రేంజ్ అధికారి
రూ.1.25 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న వైనం
2 లో..

తగ్గిన తుపాను నష్టం

- అధికారులు సమన్వయంతోనే సాధ్యం
- మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర - పర్చూరు : సమగ్ర ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, అధికారులు సమన్వయంతో పని చేయడం ద్వారానే మొంథా తుఫాను భారీ నష్టాన్ని తగ్గించగలిగినట్లు జిల్లా ఇంచార్జి మంత్రి,రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన పర్చూరు,కారంచేడు మండలాలలో విస్తృతంగా జిల్లా ఇంచార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిసి గురువారం పర్యటించారు. వాడరేవు-పిడుగురాళ్ల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారిని అడ్డంగా తవ్వించిన పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద పరిశీలించారు. జాతీయ రహదారిని తవ్వించిన ప్రాంతంలోనే గతంలో చిన్న వాగును మూత వేయడం ద్వారానే పర్చూరు మండలాన్ని వరద నీరు చుట్టుముట్టిందని గ్రామస్తులు మంత్రుల దృష్టికి తెచ్చారు. తక్షణమే జాతీయ రహదారి నిర్మిస్తున్న సదరు గుత్తేదారుడు దిగ్విజయ్ సింగ్‌తో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం గాకుండా రహదారి నిర్మించాలని సూచించారు. కారణాలు చెప్పడం మాని గతంలో ఇదే ప్రాంతంలో వాగు వెళ్తుంటే కల్వర్టు ఎందుకు నిర్మించలేదని గుత్తేదారని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనమే ముఖ్యం,సమస్యలు రాకుండా సమగ్ర ప్రణాళికతో నిర్మించాలని సూచించారు. జాతీయ రహదారిపై నిర్మిస్తున్న టోల్ గేట్ వద్ద పర్చూరు వాగు గండి పడిన ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. కప్పల వాగు(మొండి వాగు) ఉధృతికి జాతీయ రహదారి అయిదు మీటర్లకు పైగా కోతకు గురైన ప్రాంతాలు, పర్చూరు మండలంలో వరద నీట మునిగిన పొలాలు,కారంచేడు మండలంలో నీట మునిగిన పొలాలను మంత్రులు పరిశీలించారు. కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో కొమ్మమూరు కెనాల్ కాల్వ గండ్లు పడిన ప్రాంతం, పర్చూరు వాగు, కొమ్మమూరు కెనాల్ ఉధృతికి ప్రమాదకరంగా ఒకే చోట కలిసి ప్రవహిస్తున్న ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. వీరి వెంట ఆర్డిఓ పి.గ్లోరియా,నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఉప కలెక్టర్ లవన్న,ఏడిఏ ప్రవీణ, హౌసింగ్ డీఈఈ ఖాదరవల్లి,తహసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో ప్రత్యుమ్నకుమార్,మండల వ్యవసాయ అధికారి భాస్కరరావు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కౌలు రైతులకు గుర్తింపు కార్డు లేకపోయినా ఈక్రాప్ నమోదు కాకపోయినా సాంకేతిక కారణాల వల్ల క్షేత్రస్థాయిలో కౌలు రైతులను గుర్తించి పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. సాంకేతిక కారణాలవల్ల బ్యాంకులో నమోదు కాని వాటిని ప్రభుత్వ విధానంలో తీసుకున్న పంటల బీమా పథకాలకు ఉచిత పంటల బీమా స్థానంలో స్వయం పంటల బీమా పథకం ప్రవేశపెట్టడం ద్వారా బీమా ప్రీమియం రైతులే భరించాలని చెప్పటంతో బీమా ప్రీమియం భారంగా మారడంతో రైతులు బీమా చేయలేకపోయారు కాబట్టి ప్రభుత్వం బాధ్యత తీసుకొని నష్టపరిహారం పెంచి ఇవ్వాలన్నారు. ఆహార పంటలకు రూ.50,000,వాణిజ్య పంటలకు రూ.75000, ఉద్యానవన పంటలకు లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని వ్యవసాయం కౌలు రైతులు ఎకరాకు రూ.1,60,000 అరటి వరికి రూ.40,000 పెట్టుబడికి, కౌలు రూ.40,000 చెల్లించాలని నష్టపరిహారం తక్కువగా ఉంది రెమ్యూనరేషన్ చేసేటప్పుడు అవకతవకలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు జంపానీ వెంకటప్రసాద్, గుమ్మడి ఏబు, జంపాని నవీన్,తోడేటి అశోక్, కోడూరు నాగబాబు,మేరకనపల్లి పాములు పాల్గొన్నారు.

- చుండూరు మండలంలో వలివేరు గ్రామంలో మొంథ తుఫాన్ దాటికి నేలకు ఒరిగిన వరి పైరులను కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పరిశీలించారు. జమలయ్య, సింగరకొండలు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిజమైన కౌలు రైతుల పంటలను పరిశీలన చేసి పక్షపాతం లేకుండా అంచనా వేయాలని పంటల భీమా వెబ్ లాండింగ్ లాంటి కుంటి సాకులు చెప్పకుండా పంట ఎవరైతే వేశారో వారిని గుర్తించి ఎక్స్గ్రేషియా, నష్టపరిహారాలలో వారి పేరులను చేర్చి సరైన న్యాయం చేయాలన్నారు. రైతులు సరైన విత్తనాలు, సరైన ఎరువులు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే మూల్గె నక్క మీద తాటి తాటికాయ పడ్డసందంగా పకృతి విలయ తాండవం కారణంగా నోటి దగ్గరకు వచ్చిన పంట నీటి మునిగి నేలపాలు అయినందుకు ప్రభుత్వాలు రైతే రాజు రైతే దేశానికి వెన్నుముక అనే ప్రకటనలు కాకుండా చిత్త శుద్ధితో మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతులకు సరైన న్యాయం చేయాలని అధికారులును, ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు రెడ్డయ్య, యాకోబు, ఏసు, దిలీప్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర-కొమరోలు : మొంథా తుఫాను ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారి గురువారం పరిశీలించారు. ముందుగా కొమరోలు మండలంలోని అల్లినగరం కొమరోలు-2, కొమరోలు- 3, సూరవారిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో 15 ఎకరాలలో వరి పంట పాలు పోసుకునే దశలలో పడిపోయి ఉన్నది. సర్విరెడ్డిల్లి గ్రామంలో నష్టపోయిన వరి పొలాలను పరిశీలించారు.

కన్నీటిని మిగిల్చిన 'మొంథా'

(మొదటిపేజీ తరువాయి)

నగదుతో పాటు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. తుఫాను నేపథ్యంలో జోనల్ అధికారిగా నియమించబడిన సిసోడియా గురువారం ఒంగోలులో పర్యటించారు. పోతురాజు కాలువ ముంపు ప్రభావిత కాలనీలను పరిశీలించారు. బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజుల నుంచి నీటిలో ఉన్న కాలనీలు, రోడ్డు పక్కన ఉన్న పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంట్లో పేరుకుపోయిన బురదను తీసేసే కార్యక్రమాల్లో మునిసిపల్ సిబ్బంది నిమగ్నమైంది. వీలైనంత త్వరగా జిల్లాలో ముంపు బాధితులను ఆదుకునే విధంగా సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలోని పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గతంలో లైలా తుఫాను అప్పుడు చూసిన పరిస్థితులు మరోసారి జిల్లాలో నెలకొన్నాయి. అటు అధికారులతో పాటు ఇటు ప్రజా ప్రతినిధులు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పరంగా బాధితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారు. ముఖ్యంగా రైతాంగం ఆవేదనలో ఉన్నారు. వేలాది ఎకరాలు పొంట పొలాలన్నీ నీట మునగడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం ముంపు తీవ్రతకు జరిగిన పరిణామాలపై అధికారులు కూడా దృష్టి సారించారు. ఎక్కడెక్కడా చెరువులు బలహీనంగా ఎక్కడ గండ్లు పడ్డాయి, వాటికి ప్రత్యామ్నాయ మార్గాలేంటనే విషయాలపై దృష్టి సారించారు.

కృష్ణా నది నుంచి..వరదనీరు

- ముంపు ప్రాంతాలను అప్రమత్తం చేయాలి
- ప్రత్యేక అధికారి ఆర్.పి సిసోడియా

విశాలాంధ్ర -బాపట్ల : కృష్ణానది నుండి భారీగా నీరువిడుదల అవుతున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా తుఫాను ప్రత్యేక అధికారి అర్.పి సిసోడియా అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని న్యూ వి.సీ హాల్‌లో కృష్ణానది వరద ప్రభావం వల్ల ముంపుకు గురయ్యే రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు సంబంధించి, నల్లమడ కాలువ క్రింద వరద ముంపు గురయ్యే గ్రామాలలో తీసుకో వలసిన చర్యలపై రాష్ట్ర ప్రత్యేక అధికారి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో కృషా నది ముంపుకు గురయ్యే మండలాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ జిల్లాలో కృష్ణా నది వరద ముంపు గురయ్యే రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు. వరద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. జిల్లాలో కృష్ణా నదిఏ మండలాల్లో ద్వారా ప్రవహిస్తుందనే వివరాలను కలెక్టర్ ప్రత్యేక అధికారికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,ఇరిగేషన్ శాఖ ఎస్.ఇ అబూత్ ఆలీ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అటవీశాఖ రేంజ్ అధికారి

- రూ.1.25 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న వైనం

విశాలాంధ్ర - బాపట్ల : కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు పెట్టేందుకు లంచం డిమాండ్ చేసిన అటవీశాఖ రేంజ్ అధికారి వివి రమణారావును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాపట్ల మండలం ఆదర్శనగర్‌లోని నగరవనంలో వనసంరక్షణ పథకం కింద కాంట్రాక్టర్ కర్రి వీర్లంకయ్య రూ.2 కోట్లతో పార్కు, కొలను, క్యాంటీన్, ఉడెన్ డెక్ పనులు పనులు చేశారు.వీటిలో రూ.1.40 కోట్ల పనులకు సంబంధించి బిల్లులు ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగాయి. అయితే నగరవనంలో నిర్మించిన ఉడెన్ డెక్‌కు సంబంధించి రూ.5.90 లక్షల బిల్లు పాస్ చేసేందుకు రేంజ్ అధికారి రమణారావు రూ.1.25 లక్షలు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ రమణయ్య ఏసీబీని ఆశ్రయించగా గురువారం నగరవనం కార్యాలయంలో నగదు ఇస్తుండగా రమణారావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్రమాతే మాట్లాడుతూ లంచం ఇవ్వటం తీసుకోవటం చట్టరీత్యా నేరమని ఎవరైన లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నెం 1064కి కాల్ చేయాలని కోరారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరరావు, పసుపుగల్లు గ్రామాలలో గురువారం ఆయన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి అంది వచ్చిన మొక్కజొన్న పంట తుపానుకు నేలకొరిగింది అన్నారు. ఉమామహేశ్వరపురం గ్రామంలో 1000 ఎకరాలలో మిరప పంటలు సాగు చేశారని గాలివానకు చెట్లు విరిగిపోయాయని ఆయన అన్నారు. పసుపుగల్లు గ్రామంలో మొక్కజొన్న విత్తనాలు తడిసి పోయాయని అన్నారు. ఈ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులు అందరిని ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

(మొదటిపేజీ తరువాయి)

తుఫాన్ తుఫాన్‌లో అధికంగా మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యిందన్నారు. తుఫాన్ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ రియల్ టైం గవర్నెన్స్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షించారన్నారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టారు అన్నారు. తనకు ముఖ్యమంత్రి రెండుసార్లు, లోకేష్ 3 సార్లు ఫోన్ చేసి తుఫాన్ ప్రభావంపై చర్చించారన్నారు. జిల్లాలోని ఒంగోలు, సంతనూతలపాడు, కొండేపి నియోజకవర్గం సహా మిగతా నియోజకవర్గాలన్నీ మొంథా తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయి అన్నారు. ఇవే ఒంగోలులో నీటి ముంపుకు కారణం అయ్యాయి అన్నారు. 24 గంటల వ్యవధిలో 25.7 సెంటీమీటర్ల వర్షపాతం అత్యధికమన్నారు. పేర్నమెట్ట చెరువు కట్ట దెబ్బ తినటం, సంతనూతలపాడు, ఎండ్లూరు, మైనంపాడు, మండవ వారి పాలెం చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని చెరువులు పొంగి నేతాజీ నగర్ మీదుగా పదివేల క్యూసెక్కుల నీరు పోతురాజు కాలంలో అదనంగా చేరాయన్నారు.

పోతురాజు కాలువ నీటి ముంపుకు గురవటం, నల్ల వాగు ప్రవాహం పెరగటం, పెళ్లూరు చెరువు కట్ట దెబ్బ తినటం తో ఒంగోలు నగరం అతలాకుతలమైందన్నారు. ఒంగోలులోని 15 డివిజన్ల పరిధిలో 53 కాలనీలు తీవ్ర ముంపుకు గురయ్యాయి అన్నారు. వాటిలో నెహ్రూ నగర్, నేతాజీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జయప్రకాష్ కాలనీ, బిలాల్ నగర్,, ప్రకాశం కాలనీ, మిలిటరీ కాలనీ, పాపా కాలనీ, కరుణా కాలనీ ప్రధానంగా ప్రభావితం అయ్యాయన్నారు. ఏడు పునరావాస కేంద్రాల ద్వారా బాధితులకు టిఫిన్, భోజనం, తాగునీటితోపాటుగా వైద్యాన్ని కూడా అందించడం జరిగింది అన్నారు. సుజాతనగర్ నీటి సమస్య ఎస్పీతో చర్చించి, పిటిసి వద్ద కర్నూల్ రోడ్డు డివైడెడ్ పగలగొట్టి వరద నీటిని పోతురాజు కాలువలోకి మళ్లించటం జరుగుతుందన్నారు. నవోదయ స్కూల్ నీటిముంపు కారణంగా విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఆహార వసతి కల్పించామన్నారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో తాత్కాలిక కాలువలు ఏర్పాటు చేసి నీటిపారుదల చర్యలు చేపట్టామన్నారు. ఊపుకు గురైన ప్రాంతాలలోని ప్రజలకు ప్రభుత్వ సహకారంతో బుధవారం రాత్రి 7375 మందికి భోజనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే గురువారం బ్రేక్ఫాస్ట్ 7675 మందికి, లంచ్ 7325 మందికి, డిన్నర్ 7వేల 175 మందికి ఏర్పాటు చేశామన్నారు. గుండ్లకమ్మ జలాశయానికి మొంథా తుఫాన్ కారణంగా 7 టీఎంసీల నీరు 12 టీఎంసీల సామర్థ్యం కలిగిన జలాశయంలో చేరటంతో అది 13 టిఎంసిలకు చేరింది అన్నారు. ఆసియాలోనే అతి పెద్దదైన కమ్మం చెరువు పూర్తిస్థాయిలో నీరు చేరటం శుభ పరిణామం అన్నారు. దీంతో పాటు రికార్డు స్థాయిలో జిల్లాలోని 799 చెరువులు ఉండగా 650 చెరువులకు పైగా అలుగులు పారాయన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం (మత్స్యకారులకు 50 కేజీలు), కేజీ కందిపప్పు, ఒక లీటర్ పామ్ ఆయిల్, ఒక కిలో ఉల్లిపాయలు, 1 కిలో బంగాళా దుంప, ఒక కిలో పంచదార అందించినట్లు తెలిపారు.

10,272,57 హెక్టార్లలో పంట నష్టం

తుఫాను ఎదుర్కోవటంలో పూర్తి సహకారం అందించిన జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సిసోడియా, శశిధర్ లతో పాటుగా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డిఆర్ఓ ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎమ్మార్వో మధు, శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు కృషితోనే తుఫానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఓడ చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, ఏ ఎం సి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మొంథా'తో నష్టపోయిన రైతాంగానికి

సత్వర పరిహారం

- త్వరలోనే తడిచిన పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తాం
- సీఎం చంద్రబాబు అప్రమత్తతో తప్పిన పెనుముప్పు
- తుపానుతో దెబ్బతిన్న విద్యుత్ కనెక్షన్లు పూర్తిగా పునరుద్ధరణ
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర-మద్దిపాడు : మొంథా తుఫానుతో నష్టపోయిన రైతాంగానికి సత్వర పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మద్దిపాడు అద్దంకి నియోజకవర్గాల్లో సహచర మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి మంత్రి గొట్టిపాటి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని అన్నంబట్లవారి పాలెం, గర్నపూడి, తిమ్మరాజుపాలెం, అగ్రహారం, మద్దిపాడు లోని నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ పరిధి జే.పంగులూరు మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాల్లోని పంట పొలాలను అధికారులతో కలిసి తిరిగారు. పొలాలకు వెళ్లి తుఫానుతో నష్టపోయిన వరి, వేరుశనగ, వంగ, పత్తితో పాటు పలు ఉద్యానవన పంటలను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పంటలకు జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసి యుద్ధ ప్రాతిపదికన నష్టం అంచనా నివేదిక సమర్పించాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రియల్ టైంలో పర్యవేక్షించి అధికార యంత్రాంగంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను అప్రమత్తం చేయడంతో పెనుముప్పు తప్పింది అని గొట్టిపాటి పేర్కొన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పంటలు నాశనం అయ్యాయని, రైతాంగం తీవ్రంగా నష్ట పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలు, పొలాలు గడిచిన నాలుగు రోజులూ తుఫాను వరదతో నిండి పోయాయని తెలిపారు. అమ్మకాలు చేయడానికి ఇళ్లలో ఉంచిన పొగాకు తడిచిపోయిందని చెప్పారు. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి త్వరలోనే తడిచిన పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తామని రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. బాధిత రైతులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి... నష్టపరిహారం నివేదికను వెంటనే ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. అదే విధంగా సాధ్యమైనంత త్వరగా తుఫాను నష్టానికి సంబంధించి పరిహారం రైతులకు అందిస్తామన్నారు. అద్దంకి పట్టణంలోని నాలుగవ వార్డులో పర్యటించిన మంత్రి గొట్టిపాటి అక్కడి ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో సరిగా పూడికలు తీయకపోవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయని మంత్రి గొట్టిపాటి అసహనం వ్యక్తం చేశారు. పల్నాడు, అద్దంకి వంటి ఎగువ ప్రాంతాల నుంచి పర్చూరు, బాపట్ల వంటి దిగువ పల్లపు ప్రాంతాలకు వరద నీరు చేరి పంట పొలాలను ముంచెత్తాయని తెలిపారు. బాపట్ల, ప్రకాశం, మచిలీపట్నంతో పాటు ఉత్తరాంధ్రలోని ప్రాంతాలు తుఫానుతో పెద్ద ఎత్తున నష్ట పోయాయని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ, ఆక్వా, ఇతర అవసరాలకు సంబంధించిన కనెక్షన్లను కూడా గురువారం సాయంత్రానికి చాలా వరకు సరి చేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు నేతలు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన ఒంగోలు డీఎస్పీ రావిపాటి

విశాలాంధ్ర-మద్దిపాడు : గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను గురువారం ఒంగోలు డిఎస్పి రావిపాటి శ్రీనివాసరావు సందర్శించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ అధికారులు ప్రాజెక్టు నివేదికను ఎప్పటికప్పుడు అందజేయాలని స్థానిక ఎస్సై వెంకట్ సైదులు ఆదేశించారు. వాగులు వంకలు నీటి ఉధృతను బట్టి పోలీస్ యంత్రాంగం ప హరాకాయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు వివరాల అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు ఎస్సై వెంకట్ సైదులు పాల్గొన్నారు.

906 హెక్టార్లలో పంటల నష్టం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మొంథా తుఫాను పుణ్యమా అని గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న పంటలు దెబ్బతిని రైతులు లబోదిబో మంటున్నారు. పంటలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేసినా మొందా తుఫాను వల్ల పంటలు నాశనమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలో 325 హెక్టార్లలో పత్తి,485 హెక్టార్లలో మొక్కజొన్న,27 హెక్టార్లలో మినుములు, 69 హెక్టార్లలో మినుము పంటను రైతులు సాగు చేశారు.వర్షాలకు మండలంలో దెబ్బతిన్న మినుము, వరి, మొక్కజొన్న,పత్తి పంటలను ఎర్రగొండ పాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరమణ బుధవారం పరిశీలించారు.మండలంలో దాదాపు 906 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని ఆయన విలేకరులకు తెలిపారు. పంట నష్టపోయిన రైతులందరికీ పంట నష్టం వర్తించదని,భూమి రైతు పేరు మీద ఉంటేనే పంటనష్టం వర్తిస్తుందన్నారు.పంట నష్టపోయిన కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకుంటేనే పంటనష్టం వర్తిస్తుందన్నారు.పంటలో 33 శాతం నష్టం జరిగితేనే పంటనష్టానికి అర్హులన్నారు.లేత పైర్లకు విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.మండలంలో 70 శాతం ఈ క్రాప్ నమోదు జరిగిందన్నారు.మండలంలో 37,415 సర్వే నెంబర్లకు గాను 26,101 సర్వే నెంబర్లకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు సహాయ సంచాలకులు వెంకటరమణ విలేకరులకు తెలిపారు.

శానిటేషన్ పనులను వేగవంతం చేయండి

ఎంపీడీవో జీవి కృష్ణారావు

విశాలాంధ్ర-పీసీపల్లి : గ్రామాలలో శానిటేషన్ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. మెంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెందకుండా శానిటేషన్ పనులను చేస్తున్నట్లు తెలిపారు. గురువారం పెద అలవలపాడు పంచాయతీ పరిధిలో వడ్డెపాలెం గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలో వీధుల వెంట బ్లీచింగ్ చల్లించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది చేపట్టిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వర్షాకాలం నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇంటి ఆవరణంలో నీళ్లు ఎక్కువగా నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

చెరువులను ప్రత్యేక అధికారి పరిశీలన

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని తలకొండపాడు పాత ముద్దపాడు ఇరిగేషన్ చెరువులను మండల ప్రత్యేక అధికారి పి.భాస్కర్ బాబు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాత ముద్దపాడు చెరువుకు పూర్తిస్థాయిలో నీళ్లు రావడంతో పొంగే పరిస్థితి ఉన్నట్లయితే గ్రామంలోకి నీళ్లు రాకుండా పక్కనే కాల్వ తీయించి నీళ్లను మళ్లించాలని అధికారులను ఆదేశించారు తలకొండపాడు చెరువును పరిశీలించి తూము వద్ద సమస్యను గుర్తించారు అందుకు తగిన మరమత్తులు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ రెవెన్యూ పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ ఉష ఎంపీడీవో జీవీ కృష్ణారావు ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారు.

తుఫాన్ బాధిత వృద్ధులకు షేక్షావలి సాయం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల మండలం సుందరయ్య కాలనీలో గత 20 ఏళ్లుగా నివసిస్తున్న వృద్ధ దంపతులు తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొంత తుఫాన్ వల్ల జీవనోపాధి పూర్తిగా దెబ్బతినడంతో ఏ పని చేయలేక ఇబ్బందులు పడుతున్నా ఆ వృద్ధ దంపతులకు, విషయాన్ని తెలుసుకున్న దోర్నాల సేఫ్టీ డ్రైవర్ అధ్యక్షుడు షేక్షావలి ముందుకు వచ్చి, ఆ వృద్ధులకు రెండు నెలల పాటు సరిపడే నిత్యావసర వస్తువులు అందించారు. అంతేకాక, ఇల్లు కూడా కట్టించి ఇస్తానని భరోసా ఇచ్చారు.ఆ వృద్ధుడు ఆనందంతో షేక్షావలిని కృతజ్ఞతతో ఆశీర్వదించారు.

అటల్ భారత్ గౌరవ్ పురస్కారం అందుకున్న మహబూబ్ వలి

విశాలాంధ్ర – తర్లుపాడు : సామాజిక సేవ రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి గౌరవవర్గంగా అటల్ భారత్ గౌరవ్ పురస్కారం అస్సాంలోని గౌహతి నగరంలోనీ నార్త్ ఈస్ట్రన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అందుకున్నట్లు వైఎస్ఎస్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షేక్ మహబూబ్ వలి తెలిపారు. అస్సాం విధాన సభా డిప్యూటీ స్పీకర్ నోమల్ మూమెన్, అస్సాం ఎక్స్చేంజ్ మినిస్టర్ అతుల్ బోర,బాలీవుడ్ యాక్టర్ అలీ ఖాన్ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.ఈ నెలలో ఇది తాను అందుకున్న 6వ అవార్డు అని చెప్పారు.డిల్లీలో గాంధీ పీస్ ఇంటర్ నేషన్ అవార్డు, కర్నాటకలోని బెంగుళూరులొ అచీవిర్ అవార్డు, కోయం బత్తూరులో ఎవరెస్ట్ అవార్డు, బెంగుళూరులో ఇండియా అచీవ్వార్ అవార్డు, విజయవాడలో కాంపెయిన్షిప్ కమ్యూనిటీ చెంజెమేకర్ అవార్డు, ఇప్పుడు గౌహతిలో అటల్ భారత్ గౌరవ్ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

డ్రోన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల

విశాలాంధ్ర – తర్లుపాడు : తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి గురువారం వ్యవసాయ డ్రోన్ పంపిణీ చేసినట్లు తర్లుపాడు వ్యవసాయ అధికారి పి జోష్న దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా ఎనిమిది లక్షల రూపాయల సబ్సిడీతో కలుజువ్వలపాడు గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి గ్రూప్ కి పంటలపై పురుగుమందులు పిచికారి చేసు కోవటానికి వ్యవసాయ డ్రోన్ అందజేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు అందరూ ఉపయో గించు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏడిఏ బాలాజీ నాయక్,మండల వ్యవసాయ అధికారి పి.జ్యోష్న దేవి, శాస్త్రవేత్త రమేష్ ,ఏఈఓ దేవేంద్ర గౌడ్,వీహెచ్ఏ సుస్మిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర – తర్లుపాడు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తర్లుపాడు మండలంలో దెబ్బతిన్న మెట్టవరి,వేరుశనగ,మినుము పంటలను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించినట్లు వ్యవసాయ అధికారిని పి జోష్న దేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ తర్లుపాడు మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మెట్టవరిని కెవికె శాస్త్రవేత్త రమేష్ పరిశీలించారని అన్నారు. మంగళకుంట గ్రామముతో అధిక వర్షాలకు దెబ్బతిన్న వేరుశెనగ పంటను, జగన్నాధపురం గ్రామంలో కంది,మినుము పంటలను రైతులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏడిఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి పి జోష్నదేవి ఉన్నారు.

డాక్యుమెంట్ పోయింది

షేక్ షబీనా S/O మహబూబ్ సుభానీ గారి కుమార్తె W/O జానీబాషా అను నేను బాపట్ల జిల్లా పిట్టలవా నిపాలెం మండలం,చందోలు గ్రామ పంచాయతీ నది ముల్లాపాలెం గ్రామ నివాసి నైయున్నాను.అయితే నేను చందోలు గ్రామం లో రేకొక ఇల్లు మారు సమయం లో డాక్యుమెంట్లు పోయినవి.ఎంత వెతికినాను కనిపిం చలేదు. లింకు డాక్యుమెంట్ నెం : 427/2016, సర్వేనెం:290/1బి,ఎవరైనా దొరికిన యెడల సెల్ నెం: 6302612707కు తెలియజేయగలరు

దోర్నపు వాగుపై హైలెవెల్ చప్టా నిర్మాణానికి కృషి

- దర్శి నియోజకవర్గ
టీడీపీ ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర - తాళ్లూరు : తాళ్లూరు-విఠలాపురం గ్రామాల నడుమ గల దోర్నపువాగు చప్టాను హైలెవెల్ చప్టా నిర్మాణంకు చర్యలు చేపట్టి తాళ్లూరు ప్రాంత ప్రజల రాక పోకలకు ఇబ్బందులు తలెత్త కుండా కృషి చేస్తానని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టి పాటిలక్ష్మి తెలిపారు. మొంథా తుఫాన్ వల్ల తాళ్లూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలుసుకునేందుకు గురవారం ఆమె తాళ్లూరులో పర్యటించారు. తాళ్లూరు- విఠలాపురం గ్రామాల నడుమ రెండు రోజులైనా ప్రవాహం తగ్గక రాక పోకలకు ఇబ్బందిగా వున్న దోర్నపువాగు చప్టాను పరిశీలించారు. తాళ్లూరు నుండి అన్ని గ్రామాలకు ప్రధాన రహదారిగా వున్న ఈ మార్గంలో గల దోర్నపువాగు లోలెవెల్ చప్టా వల్ల వాగు ప్రవహించినప్పుడల్లా రాక పోకలకు ఇబ్బందిగా తయారైందని టీడీపీ నేతలు ఆమె దృష్టికి తీసుక వచ్చారు.గత టీడీపీ ప్రభుత్వంలో రాక పోకలకు ఇబ్బందిగా వున్న చప్టాకు కొంత మేర మరమ్మత్తులు చేయించారన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా చప్టాపై గుండా వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వాహన రాక పోకలకు అవరోధంగా వుంటుందన్నారు. వర్షం కురిసినప్పుడల్లా వాగు ప్రవహిస్తూ హైదరాబాద్ , విజయవాడ ,అద్దంకి బస్సు సర్వీసులు రద్ద అవుతూ ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లా డుతూ ...రాష్ట్ర ఆర్అండ్ బి మంత్రి, అధికారుల దృష్టికి ఈ చప్టా నిర్మాణ ప్రాధాన్యతను తీసువెళ్లి హైలెవల్ చప్టా నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తారన్నారు. తుఫాన్ జరిగిన పంట నష్టాలను ఏవో ప్రసాద్ రావు ను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం అందేలా చూడాలని ఏవోకు సూచించారు. ఈకార్యక్రమంలో దర్శి టీడీపీ నాయకులు డాక్టర్ లలిత్ సాగర్, ఎం పీపీ తాటికొండ శ్రీనివాసరావు, రాష్ట్ర నాటక అకాడమి కార్పోరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్ బాబు, రాష్ట్రతెలుగు యువత కార్యదర్శి వేణుబాబు, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షులుగొంది రమణా రెడ్డి, పిన్నిక రమేష్ కుమ్మిత సుబ్బారెడ్డి, ముండ్లమూరు టీడీపీఅధ్యక్షులు శ్రీనివాసరావు, విద్యాసాగర్, ఎంఈవో సుబ్బయ్య, సీఐ రామారావు, ఎస్సై మల్లికార్జునరావు,డిటీ ఫణీంద్ర, ఆర్ఎ సుధీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోని కలిసిన రమేష్ నాయుడు



విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : తిరుమలలో తిరుమల తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్ సింఘాల్‌ని దేవస్థానం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి వస్త్రము ప్రసాదము అందజేయడం జరిగింది. అనంతరం దోర్నాల వద్ద భక్తులకు యాత్రికుల కోసం తిరుమల తిరుపతి ద్వారా ఒక వసతి సముదాయము డార్మెటరీ నిర్మించాలని, అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని ,వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు వెంటనే సానుకూలంగా స్పందించి చేస్తామని చెప్పడం జరిగింది. టిటిడి తరఫున టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డిని వెళ్లి పరిశీలించి ఎన్ని గదులు అవసరము చెప్పమని వారికి చెప్పడం జరిగింది .టిటిడి పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి పది రోజుల్లో శ్రీశైలం దర్శనానికి వచ్చి ఈ వసతి సముదాయాల గురించి పరిశీలించి ఈవోకి పూర్తిస్థాయిలో నివేదిక అందజేస్తానని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల్లి మండలి చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ అడిగిన వెంటనే ఈవో సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా వసతి గదుల సముదాయం నిర్మిస్తామని, చెప్పినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు, ఈ కార్యక్రమంలో ఈవో తో పాటు టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ విషయాన్ని ప్రకాశం జిల్లా బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగరాల అశోక్ రెడ్డి మీడియా తో పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.

సీపీఐ నేత స్వర్ణలత ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరు మార్పు జోసెఫ్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది గురువారం తెల్లవారుజామున ఆయన సతీమణి స్వర్ణలత అనారోగ్యంతో మృతి చెందడంతో వారికుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర నాయకులు అందె నాసరయ్య గిద్దలూరు నియోజకవర్గం రైతు సంఘం కార్యదర్శి ధాకాల పుల్లయ్యలు బేస్తవారిపేటలోని జోషఫ్ స్వగృహానికి వచ్చి స్వర్ణలత పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యలకు తమ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు, వేల్పుల అంకయ్య, డి ఖలీల్ తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యంకు నిలువుసాక్ష్యం..స్కూల్ మట్టిమిద్దె

విశాలాంధ్ర-కంభం : మండలంలోని రావిపాడు గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కూలిన సత్యనారాయణ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాఠశాల మట్టి మిద్దె బుధవారం కూలింది. ఎంఈవో సత్తార్ ముందస్తు జాగ్రత్తగా మండలంలోని అన్ని ఎయిడెడ్ ,ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తుఫాన్ ప్రభావం తో పాత పాఠశాలల భవనాలు చూసుకోవాలని పేర్కొన్నారు. గురువారం ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, టి.శ్రీనివాసులు, కాంప్లెక్స్ చైర్మన్ గని.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు మట్టి మిద్దెగా ఉన్న స్కూల్ భవనం కూలిందనీ, ముందస్తు హెచ్చరికలు చేస్తూ, పాఠశాలలకు సెలవు ప్రకటించినందున ఎవరికి ఎటువంటి హాని జరగలేదని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఎర్ర రిబ్బన్లు కట్టి పాఠశాల గేటుకు తాళం వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అద్దె భవనంలో పాఠశాలను కొనసాగించాలని తెలిపారు.అనంతరం కంభం రోడ్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి స్లాబ్ సామర్థ్యాన్ని పరిశీలించారు.నాడు నేడు ద్వారా నిర్మించబడ్డ సదరు పాఠశాలలో పెచ్చులూడడం గమనించి, జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం. పాండురంగయ్య, శ్రీనివాసులు, కొండల్ రావు, సిఆర్పిలు రామలింగయ్య పాల్గొన్నారు.

చీమకుర్తి నూతన సీఐగా ప్రసాద్

విశాలాంధ్ర-చీమకుర్తి : జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం చీమకుర్తి నూతన సిఐగా డి దుర్గాప్రసాదును బుధవారం నియమించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలను నియంత్రిస్తానని అలాగే ట్రాఫిక్ సమస్యలనుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

ఎద్దులరేవు వద్ద రహదారి కోత

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎద్దుల రేవు వద్ద వరద ప్రవాహానికి రహదారి కోతకు గురైంది. ఆ మార్గంలో నిత్యం ప్రయాణించే రైతులు, ప్రజలు, పశు పోషకులు నీరు ఉధృతంగా ప్రవహించి రహదారి కోతకు గురి కావ దంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మరమ్మతులు చేయకపోతే వ్యవసాయ పనులు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మొంథా తుఫాన్ కారణంగా గత రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు గృహాలలో నీరు చేరి ఇబ్బందులు గురై పునరావాస కేంద్రాలలో ఉంటున్న కొనకనమిట్ల ఎస్సీ కాలనీ నాగరాజు కుంట, ఎస్సీ కాలనీ నాయుడుపేట ఎస్సీ కాలనీలో పునదోవాస కేంద్రాల్లో ఆవాసాలు ఉంటున్నారు. వారికి 25 కేజీలు బియ్యం నిత్యవసర సరుకులను తాసిల్దార్ ఆవుల సురేష్, ఎంపీడీవో డి ఈశ్వరమ్మ, మండల టిడిపి నాయకుల చేతుల మీదుగా గురువారం మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ తాసిల్దార్ ఆవులు సురేష్ యు ఆర్ డి శ్రీదేవి మాట్లాడుతూ కొన కనమిట్ల ఎస్సీ కాలనీలో నాగరాజు కుంట ఎస్సీ కాలనీ నాయుడుపేట ఎస్సీ కాలనీలలో మొత్తం 92 మంది పునరావస్ కేంద్రాల్లో ఆవాసాలు ఉంటున్నారని, 25 కేజీల బియ్యం కందిపప్పు ,నూనె ఉల్లిగడ్డలు బంగాళదుంప సరుకులను ఇవ్వమని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కొనకనమిట్ల ఎస్సీ కాలనీలో ఐదుగురికి పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన వారికి స్టాకు వచ్చిన వెంటనే అందజేయడం జరుగుతుందన్నారు మండల టీడీపీ అధ్యక్షుడు ఎం. బాబురావు, రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు కనకం నరసింహారావు, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, తెలుగు యువత నాయకులు పిసుకుదేవ్ ముప్వ కాటమరాజు ముక్కాల శ్రీనివాసులు రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు అండగా ఉంటా

దర్శి టీడీపీ ఇన్చార్జి
డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముంతా తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులందరికీ అండగా ఉంటానని ఎవరు అధైర్య పడవద్దని దర్శి టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మండలంలోని ముండ్లమూరు, వేంపాడు, ఉమామహేశ్వరపురం, గ్రామాలలో గురువారం ఆమె పర్యటించారు. గ్రామాలలో దెబ్బతిన్న పంటలైన పొగాకు ,మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో దెబ్బతిన్న పంట లకు సంబంధించి అంచనాల తయారు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ, లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది అన్నారు. పంట నష్టపోయిన రైతులందరూ తమ వివరాలను అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఉమామహేశ్వర పురం, చింతలపూడి గ్రామాల మధ్య గల రోడ్డును, పంచాయతీ ప్రహరీ గోడను ఆమె పరిశీలించారు. అద్దంకి, దర్శి ప్రధాన రహదారిలో గల చిలక లేరు వాగు పొంగి ప్రవహించడంతో తారు రోడ్డు లేచిపోయి దెబ్బ తినడంతో ఆమె పరిశీలించారు. ముండ్లమూరు నుండి తమ్మలూరువెళ్లే చిలకల్లేరుపై ఉన్న బ్రిడ్జి గొట్టాలు లేచిపోవడంతో ఆమె పరిశీలించారు. తుఫాను చర్యలలో భాగంగా జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం పద్మావతి, పంచాయతీరాజ్ ఏఈ ఎం వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఎస్కే కాలేశా, విద్యుత్ ఏయి టి అంకబాబు, వ్యవసాయ అధికారి ఎ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎల్ మాధవి లత, మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు సోమపల్లి శ్రీనివాసరావు, దర్శి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మేదరమెట్ల వెంకటరావు, సొసైటీ అధ్యక్షులు మేదరమెట్ల నారాయణస్వామి, నీటి సంఘం అధ్యక్షులు కంకణాల వెంకటరావు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్

విశాలాంధ్ర-చినగంజాం : మండల పరిధిలోని చినగంజాం, పెదగంజాం,గొనాసపూడి గ్రామాల్లోని వాగులు,రైల్వే అండర్ పాస్, నాగన్న వాగు,బుచ్చిగుంట, రొంపేరు బ్రిడ్జి,కొమ్మమూరు కాలువలను గురువారం మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైల్వే అండర్ పాస్ బుచ్చిగుంట పెదగంజాం వారధి పోలేరమ్మ టెంపుల్ మధ్యలో నీటి ప్రవాహం ఉన్నదని ముందు జాగ్రత్తగా రాకపోకలు కూడా లేకుండా అచ్చట సిబ్బందిని డ్యూటీ వేశామన్నారు. రెవెన్యూ,పోలీస్,పంచాయతీ రాజ్ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకు వెళ్లడం నిషేధం

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని పెనుమూడి గ్రామంలో గల కృష్ణానదికు ప్రకాశం బ్యారేజ్ నుండి వరదనీరు విడుదల చేసినందున పెనుమూడి గ్రామంలో పల్లిపాలెం,కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలకు కృష్ణా నదిలోకి వేటకు,కృష్ణ నది ఒడ్డుకు ప్రజలను వెళ్లరాదని రేపల్లె మండల తాసిల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుండి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారని, లోతట్టు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,తహసీల్దార్ నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి గ్రామస్తులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఆర్ఐ పి.రాంబాబు,మండల పంచాయతీ అభివృద్ధి అధికారి సిహెచ్ రవిబాబు,గ్రామ వీఆర్ఓ రామస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటి సోమవారం..శివునికి ప్రీతికరం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కార్తీక మాసంలో శ్రవణ నక్షత్రం ఉన్న రోజును కోటి సోమవారం అని అంటారు.శ్రవణా నక్షత్రం కలిసి వస్తున్న ఈరోజు ఉపవాసం చేస్తే కోటి సోమవారాలు ఉపవాస ఫలితం దక్కుతుందని గురువారం కోటి సోమవారం రోజు కనుక భక్తులు శివాలయంలో బారులు తీరారు.ఈరోజు శివాలయ సందర్శనం,అభిషేకం,ఉపవాసం,లేదా ఏకభుక్తం ఎవరి తోచినట్టు వారు చేసినట్లయితే విశేష ఫలితం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.అదేవిధంగా ఈరోజు దీపారాధన ఆకాశదీప దర్శనం, దానాలు, ధర్మాలు చేస్తే రెట్టింపు ఫలితం దక్కుతుందని శాస్త్ర ప్రవచనం చెబుతుంది.కార్తీక మాసం శివునికి అత్యంత ప్రీతికరమైనది.ఈ మాసంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అన్ని సోమవారాలు ఉపవాసం ఉండి ఆయనను పూజిస్తారు. కోటి సోమవారాన్ని పురస్కరించుకొని బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు ఆలయ ధర్మకర్తల కమిటీ అధ్యక్షులు అన్నపురెడ్డి సాంబశివరావు,ధర్మకర్తలు లకింశెట్టి వెంకట నారాయణ,కట్టా శీను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాటు చేశారు.రాసంశెట్టి నాగాంజనేయులు,నంబూరు శ్రీనివాసరావులు తీర్థప్రసాదాలు అందించారు.

బంగారు గొలుసు చోరీ ప్రయత్నం..
ప్రతిఘటించిన మహిళలు

విశాలాంధ్ర - అద్దంకి : మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి ప్రయత్నించిన దొంగను మహిళలు ప్రతిఘటించిన సంఘటన గురువారం అద్దంకిలో చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు కలవకూరు రోడ్డులో కిరాణా కొట్టు వద్దకు గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి వాటర్ బాటిల్ ఇవ్వమని అడగడంతో దుకాణంలో ఉన్న మహిళ బాటిల్ ఇస్తున్న క్రమంలో మహిళ మెడలోని గొలుసు లాక్కొని పారిపోతుండగా పక్కనే బేల్దారి కూలీ పనులు చేస్తున్న మరో మహిళ దొంగ బైక్ తాళాలు తీసుకొని ఇరువురు మహిళలు దొంగను ప్రతిఘటించారు.అగంతకుడు వారికి కత్తి చూపించి తాళాలు ఇస్తే చైన్ ఇస్తానని చెప్పడంతో వారు తాళాలు ఇవ్వడంతో చైన్ అక్కడే పడేసి తాళాలు తీసుకొని బైక్‌పై పరారైనట్లు స్థానికులు తెలిపారు.

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర - రేపల్లె : అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయడం సంతోషకరమని మంత్రి సత్యప్రసాద్ అధికారులను అభినందించారు.గురువారం రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ తుఫాను రివ్యూ సమావేశం నిర్వహించారు.అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయటం అభినందనీయమన్నారు. ఎలాంటి ఆస్తి నష్టం,ప్రాణ నష్టం జరగకుండా సహాయ చర్యలు చేపట్టడం పట్ల మంత్రి అధికారులను అభినందించారు. అదే విధంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఒకరికి అయితే రూ.1000, కుటుంబానికి రూ.3000 లు,నిత్యవసర సరుకులు ఇచ్చే విధంగా ప్రభుత్వం సహాయ ప్రకటించిందని,అందుకు అనుగుణంగా 24 గంటల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి సాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.చేనేత,మత్స్యకారులకు కూడా ప్రభుత్వం సహాయం అందజేస్తుందని మంత్రి తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డిఓ రామ లక్ష్మి,డిఎస్పీ శ్రీనివాసరావు,కమిషనర్ సాంబశివ రావు,తహసీల్దార్ శ్రీనివాసరావు,టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్,జి.శ్రీనివాసరావు,పట్టణ టిడిపి అధ్యక్షులు మేక రామకృష్ణ,వ్యవసాయ శాఖ, హౌసింగ్,ఫిషరీస్,పంచాయతీరాజ్ శాఖ అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

బీరక సురేంద్ర

విశాలాంధ్ర - వేటపాలెం : మొంథా తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన దేశాయిపేట పంచాయతీ పరిధిలోని విఘ్నేశ్వర, న్యూ కెపాల్, జగనన్న కాలనీల్లో దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నీటమునిగిన కాలనీల్లో వెంటనే నీరు తొలగించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.చేనేత కార్మికుల మగ్గాలు, పనిముట్లు దెబ్బతిన్నాయని,ఒక్క మగ్గాన్ని పునరుద్ధరించడానికి కనీసం రూ.25 వేల ఖర్చు అవుతుందని ఆయన వివరించారు.విపత్తు నిర్వహణ నిధుల ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలకు హామీ ఇచ్చిన రూ.25 వేల ఆర్థికసహాయాన్ని తక్షణం అమలు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పన్నెం వెంకట సుబ్బారావు,బీరక సురేష్,పన్నెం మల్లి, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సాంబశివుడు, రంగారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై వాహనాలు నిలుపుదల

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని ఏ.ఎం.ఆర్ ప్రైవేట్ సంస్థ వారు తమ కంటైనర్లు కొండ క్వారీల వద్ద బల్లికుర నుండి మార్టూరు వైపు గంగమ్మ గుడి నుండి సంతమాగులూరు వైపు మల్లయపాలెం నుండి వేమవరం గ్రామం వైపు దాదాపు 25 కంటైనర్లు బాక్సులు ఏర్పాటు చేసి ఉన్నారు. భూగర్భ గనులకు సంబంధించిన టెండర్లు రాయల్టీ దక్కించుకున్న సంగతి విధేయతమే.గత పది రోజుల నుంచి వసువుల ప్రక్రియ మొదలు పెట్టి ఉన్నారు.వసువుల ప్రక్రియలో భాగంగా క్వారీ నుంచి వచ్చేలా మెటీరియల్ ట్రాన్స్పోర్ట్ వాహనాలు తనిఖీలు భాగంగా ఆర్ అండ్ బి రోడ్డు నిలుపుదల చేసి సంబంధించిన బిల్లులు చెక్ చేయటంతో కనీసం 10 నిమిషాలు పడుతుంది. దీనితో నిత్యం వాహనాల రద్దీతో మల్లయపాలెం నుండి తాతపూడి వెళ్లే రోడ్డు మార్గం వాహనాలు ఏఎంఆర్ సిబ్బంది గ్రానైట్ లారీలను నడిరోడ్డు మీద నిలుపుదల చేయటంతో ప్రయాణికులు వాహనదారులు కొంత సమయం ఆగల్సి వస్తుందని వెంటనే సంబంధించిన అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రస్తుతం వరి పైరు ఈనిక దశలో ఉన్నందున వర్షాలకు గింజలలో నీరు చేరుట వలన గింజ రంగు మారడం,మాని పండు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.లక్ష్మి అన్నారు.గురువారం ఆమె ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కృష్ణకుమారి,డాక్టర్ ఎం.కామాక్షిలతో కలిసి పొలాలను సందర్శించి చేపట్టవలసిన సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. రైతులు వాతావరణం అనుకూలించిన తర్వాత ఎకరాకు 200 మిల్లీలీటర్లు ప్రాఫికొనోజోల్ పిచికారి చేయాలన్నారు.తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారికి అందుబాటులో ఉన్న డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు.ఈ క్షేత్ర పర్యటనలో మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ వ్యవసాయ విస్తరణ అధికారులు తూము ప్రేమ్ కుమార్,బిడి రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.శివతేజ,పిఏసిఎస్ గూడవల్లి అధ్యక్షులు ఏ.నరేంద్రబాబు,గ్రామ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లను
హౌసింగ్ ఏఈ పరిశీలన

విశాలాంధ్ర - సంతమాగులూరు : తుఫాన్ ప్రభావంతో ఏల్చూరు గ్రామంలో ఇరువురికి చెందిన మట్టి గోడలతో ఉన్న రేకుల ఇల్లు,పెంకుటిల్లు దెబ్బ తిన్నాయి.విషయం తెలుసుకున్న సంతమాగులూరు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎ.యర్రకోటయ్య గ్రామ రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు.ఈసందర్భంగా బాధితులు షేక్ చాంద్ బి,పులగుర శ్రీనుతో మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రధానమంత్రి ఆవాస యోజన గ్రామీణ పథకం ద్వారా గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని చెప్పారు.ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆదంషఫీ,వీఆర్వోలు చైతన్య, జ్యోతిబాబు,ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రావణి ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి: బాలమ్మ

విశాలాంధ్ర - అద్దంకి : తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో కురిసిన వర్షాలకు వర్షపు నీరు నిల్వ ఉండి అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి బాలమ్మ అధికారులకు సూచించారు.గురువారం ఆమె మండలంలోని మణికేశ్వరంలో పర్యటించారు.గ్రామంలో సైడ్ కాలువలు లేక మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.గ్రామంలో సైడ్ కాలవలు నిర్మించాలని కోరారు. శానిటేషన్ తాగునీటి సరఫరాకు సంబంధించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీడీవో వరూధిని పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆహార పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో మొంథా తుపాను కారణంగా చీరాల రోశయ్య కాలనీలోని యానాది సంఘంలో నివసిస్తున్న 160 మందికి ఆహార పొట్లాలు,మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్,బందారుపల్లి హేమంత్ కుమార్,డాక్టర్ బాబూరావు,సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శుక్రవారం 31 ‌| అక్టోబరు | 2025

అధైర్య పడవద్దు..అండగా ఉంటాం...

ఎమ్మెల్యే మద్దులూరి కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మొంథా తుఫాన్ కారణంగా వరదకు గురైన దేవాంగపురి గ్రామ పంచాయితీలోని ప్రాంతాలలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య,చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్‌లు పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. ఇళ్లల్లో చేరిన నీళ్లను మోటార్లతో తోడాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రజలకు మంచినీటి సదుపాయం,భోజన వసతి ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- రామకృష్ణాపురంలో : కుందేరు సమీపాన వరదకు గురైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పరిశీలించారు. ప్రజలకు అండగా ఉంటామని ఏ ఒక్కరూ అధైర్య పడవద్దన్నారు. నీరు చేరిన ప్రాంతాలలో మోటార్లు పెట్టి నీటిని తోడాలని అధికారులను ఆదేశించారు.

- కొత్తపాలెంలో : తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. మండలంలోని కొత్తపాలెం కాలవ కట్ట వద్ద నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరితగతిన పంట నష్టం వివరాలను సేకరించి రైతులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు జాగ్రత్తలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. చీరాల మండలంలోని తోటవారిపాలెం,బోయినవారిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ బి.కృష్ణవేణి మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పొలంలో నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు. ఎకరాకు 20 కేజీల యూరియా,10 కేజీల పొటాషియంను వేసుకోవాలని సూచించారు. వరి పొలం ఆరిన తర్వాత ఎకరం పొలానికి 300 గ్రాముల కార్బన్డిజం లేక 200 గ్రాముల ప్రాపికొనజోల్‌ను పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పొలాల్లో ఉన్న నీటిని తీసివేసి ఎకరాకు 400 గ్రాముల సాఫ్‌ను వేయాలని డాక్టర్ డి సంపత్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. కామాక్షి,డాక్టర్ డి.సందీప్‌రాజు, చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులు టి.రత్నకుమారి,మండల వ్యవసాయ అధికారి పి.నిర్మలాదేవి,వివిఏలు నీలిమ, జ్యోతి,రైతులు పాల్గొన్నారు.

ఇళ్ళు,గుడుల్లో నిలిచిన నీరు

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామంలో మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షానికి వచ్చిన నీరు శివాలయం, పోలేరమ్మ గుడి ప్రాంగణంలోనికి అలాగే పలు పల్లపు ప్రదేశాలలోని ఇళ్లల్లోకి నీరు చేరాయి. కార్తీకమాసంలో గుడిలో పూజలు చేసుకోవడానికి వెళ్లే భక్తులకు ఇళ్లల్లో నివాసం ఉండే వారికి చాలా అసౌకర్యంగా ఉండి ఇబ్బంది పడుతున్నామని దీనివల్ల దోమలు కిటకాలు పెరిగి వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందని ముప్పవరం గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అలాగే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని నీటిని బయటకు పంపి ప్రజల ఇబ్బందిని తొలగించవలసిందిగా కోరుకుంటున్నామని గ్రామ టీడీపీ నాయకులు గరిమిడి జగనన్ మోహనరావు,ప్రజలు తెలిపారు.

పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో ఓపెన్ హౌస్

- ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం
- విద్యార్థులకు విజ్ఞానం పెంపు
- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

విశాలాంధ్ర -బాపట్ల : ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం,పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రజలకు వివరించడమే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా అక్టోబర్ 30 గురువారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ అధికారులు,సిబ్బంది విధినిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు,పరికరాలు,వాటి పనితీరు,సాంకేతిక సాధనాలను గురించి,వేలిముద్రలు సేకరించే పరికరాలు వాటి ఉపయోగాలు గురించి ఎస్పీ స్వయంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుండి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా,రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సంస్మరణ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జిల్లాలో అక్టోబర్ 21న స్మృతి పరేడ్ నిర్వహించడం జరిగిందన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ముఖ్య ఉద్దేశం ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం, యువతను భాగస్వామ్యం చేసి చట్టాలపై, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ శాఖ నిర్వహించే విధులు ఏ విధంగా ఉంటాయి, పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరు,ముఖ్యమైన వీఐపీ బందోబస్తుల్లో పోలీస్ శాఖ నిర్వహించే విధులు, మహిళలకు సేవలు అందించేందుకు శక్తి బృందాలు నిర్వహించే విధులు,సాంకేతిక విభాగం పనితీరు, డ్రోన్ల వినియోగం,సీసీ కెమెరాల ఉపయోగాలు,లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్.హెచ్.ఎమ్.ఎస్) కెమెరాలు ఏ విధంగా పనిచేస్తాయి,వాటిని ఉపయోగించి ఇంటిలోకి ప్రవేశించిన వారిని ఎలా పట్టుకుంటారు వంటి విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి,సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్,ఎస్‌బీ సీఐ జి.నారాయణ,ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ అహ్మద్ జానీ,మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు,ఇంకొల్లు సీఐ రమణయ్య,అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్‌లు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో ఈర్లకొండ క్వారీలో శ్రీనివాస గ్రానైట్ క్వారీ యాజమాన్యులు క్వారీలో నుంచి వచ్చిన వాన నీటిని మల్లాయపాలెం నుండి సంతమాగులూరు ఆర్ అండ్ బి రోడ్డుపై వర్షపు నీరు వదలడంతో ప్రయాణికులు అవస్థపడుతున్నారు. వ్యక్తిగత పనులు మీద వాహనాల మీద పోతున్నప్పుడు వర్షపు నీరు వల్లన మోటార్ వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కోట్లు కోట్లు పెట్టి వ్యాపారం చేసే క్వారీ యాజమానులు సైడ్ డ్రైనేజీలు బ్లాక్ చేసి రోడ్డుమీద వర్షపు నీరు పెడుతున్నారని వెంటనే సంబంధించిన అధికారులు క్వారీ యాజమాన్యతో సమావేశపరిచి క్వారీ ముందు సైడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేసి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఉద్యాన పంటలను పరిశీలన

విశాలాంధ్ర- కురిచేడు : మండలంలోని ఆవులమంద గ్రామంలో మిరప, పంటను ఉద్యాన అధికారిని ఇన్చార్జి ధనలక్ష్మి గురువారం పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల అనంతరంలో పొలంలోని నీలువ నీటిని ఎప్పటికప్పుడు పొలంలో నుంచి బయటికి పంపించే ఏర్పాట్లు చేయవలెను. భూమిలో పంటను ఉరకెత్తిన చూసుకోవాలి మొక్కలు వడ బడి తలలు వాల్చినట్లయితే ద్రావణం పిచికారి చేయాలి. రైతులు పాల్గొన్నారు.

సీనరీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విశాలాంధ్ర -చీమకుర్తి: చీమకుర్తి టీడీపీ నాయకులు ట్రాక్టర్ యజమానులు సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎం విజయ్ కుమార్ ని కలిసి ఏ.ఎమ్.ఆర్. సంస్థ వలన స్థానిక ప్రజానీకానికి జరిగే నష్టం గురించి వివరించారు. మండల పరిధిలోని స్థానిక రైతులు ,ప్రజల అవసరాల నిమిత్తం డాక్టర్ల ద్వారా తీసుకుని వెళ్లే గ్రానైట్ క్వారీల వద్ద వేస్ట్ మట్టి, సైజు రాయి,గుండు రాళ్లు వంటివి పశువుల కష్టాలకు నిర్మించుకునేందుకు,స్థానిక పొలం వద్ద రైతులు వాటిని తోలుకునేందుకు, తీసుకెళ్ళు వాటిని కూడా ఆపిఎమ్ఆర్ సమస్య సీనరీ వసూలు చేస్తున్నారని, చీమకుర్తి మండల పరిధిలోని డాక్టర్లు మొత్తానికి ఆ సీనరీ నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేని కోరారు. వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనం రాజేశ్వరి ప్రసాద్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముప్పూరి చలమయ్య,క్లస్టర్ ఇంచార్జ్ కాట్రగడ రమణయ్య, కార్యదర్శి అవనిగడ్డ శేషయ్య, యద్దలపల్లి రామబ్రహ్మం,రావిపాటి రాంబాబు, గొల్లపూడి కోటేశ్వరరావు నర్రా నాగరాజు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి పురపాలక సంఘం కార్యాలయం నందు 31-10-2025 శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు అధ్యక్షతన చీమకుర్తి పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేయటం జరుగుతుందని, కావున సదరు విషయం ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్ కోఆప్షన్ సభ్యులు అధికారులు పాల్గొనాలని అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి చేస్తున్నానని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ తెలిపారు.

క్విస్ ఉపాధ్యాయురాలికి ఉత్తమ అధ్యాపక అవార్డు

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాల డీపీఆర్ ఎస్ విభాగంలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ హెడ్ డాక్టర్ ధరణి ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. పరిశోధన విభాగంలో ఆమె అందించిన ప్రత్యేక సేవలకు గాను ఆమెకు ఈ అవార్డు లభించింది. హైదరాబాద్ లోని బ్రెయిన్ ఓ విజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ అవార్డును డాక్టర్ ధరణీకి అందజేశారు. దేశవ్యాప్తంగా పరిశోధన రంగానికి చెందిన 3000 మందిలో క్విస్ కళాశాలకు చెందిన ధరణీకి ఈ అవార్డు అందజేశారు. విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమని, వారితో పరిశోధనలు చేయించినందుకు తమ కళాశాల ఉపాధ్యాయురాలికి అవార్డు రావడం ఆనందంగా ఉందని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

భైరవకోన జలపాతం వద్దకు అనుమతి లేదు

ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణారెడ్డి

విశాలాంధ్ర-సిఎస్ పురం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రమైన భైరవకోనకు భక్తులు ఆలయ దర్శనానికి భక్తులకు అనుమతి స్తున్నామని, జలపాతం ప్రాంతానికి ప్రవేశం తాత్కాలికంగా నిషేధించ బడిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి డి వంశీకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోందని, కొండలపై నుండి నేరుగా జలధార పడేచోట నీటితో పాటు రాళ్లు పడే అవకాశం ఉందని, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జలపాతం ప్రాంతానికి ప్రవేశాన్ని తాత్కాలికంగా నిషేధించామని అన్నారు. జలపాతం దగ్గర నీటి తొట్టి సురక్షితంగా ఉందని తెలిపారు. భైరవేశ్వర ఆలయ దర్శనానికి, పూజలకు భక్తులు రావచ్చునని అన్నారు. తాజా వర్షాల ప్రభావంతో భైరవకోన పరిసరాలు పచ్చని ముస్తాబుతో ఆహ్లాదకరంగా మారినప్పటికీ, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జలపాతం దగ్గర ఆలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని, భక్తులు ఆలయ సిబ్బంది సూచనలను పాటించి, ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-సిఎస్ పురం : సి ఎస్ పురం మండల పరిధిలో మండల పదిమందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పంపిణీ చేశారు బుధవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల టిడిపి నాయకులతో కలిసి లబ్ధిదారులకు 5 లక్షల 51 వేల 701 రూపాయలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు మాట్లాడుతూ కష్ట కాలంలో ప్రజలకు అండగా ఉంటూ తక్షణమే సహాయం అందిస్తూ, ప్రతి అర్హుడి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిదారులకు కొంత ఊరట లభించిందని అన్నారు మండల టీడీపీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్య, పంచాయతీ వార్డు మెంబర్ తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ నాయుడు, మండల తెలుగు యువత, ఎస్సీ సెల్ అధ్యక్షులు కామనబోయిన వెంకటస్వామి, కువ్వారపు యేసు రత్నం, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు అన్నెబోయిన తిరుపతయ్య, పట్టణ అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, బత్తుల శ్రీనివాసులు, బత్తుల పూర్ణ, ఎడవల్లి సుబ్బయ్య, సామల తిరుపతిరెడ్డి, పోకల రవిచంద్ర, తిరుపతయ్య, నన్నసాని మహా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ఉగ్రరూపం

- రాకపోకలు బంద్
- కూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు
- వేలాది ఎకరాల్లో పంట నష్టం

విశాలాంధ్ర-మార్కాపురం : మొంథా తుఫాన్ ఉగ్రరూపానికి మార్కాపురం ప్రాంత ప్రజలు విల విలలాడారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకూ మార్కాపురంలో 16 సెం.మీ వర్షపాతం నమోదైంది. గత 20 యేళ్లుగా పొంగని గుండ్లకమ్మ ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు విలవిలలాడారు. బుధవారం మధ్యాహ్నం వరకూ మార్కాపురం పట్టణానికి పలు గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లకమ్మ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో రోడ్డుపై పది అడుగుల మేర నీరు ప్రవహించడంతో ఊర్లలోనికి, ఇళ్లలోనికి వరద నీరు చేరింది. దీనితోపాటు ఉప్పు వాగు, తీగలేరు, చెరువు, వాళులు ఎక్కడికక్కడ రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్థంభించా యి. మార్కాపురం నుంచి నాగులవరం, తర్లుపాడు నుంచి బొడిచర్ల మధ్య ఉన్న గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బొడిచర్ల నుంచి చప్టాపై గుండ్లకమ్మ పొంగడంతో టొడిచర్ల, మాల్యవంతునిపాడు గ్రామాల మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. మార్కాపురం చెరువుకాలువ పొంగడంతో తిప్పాయిపాలెం, కొండేపల్లి, అమ్మవారిపల్లి. శివరాంపురం గ్రామాల్లోనికి వరదనీరు చేరింది. మార్కాపురం తహశీల్దార్ చిరంజీవితోపాటు పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది అందరూ ప్రొక్లైన్లద్వారా గుంతలు తవ్వి నీటిని మళ్లించారు. దరిమడుగు దగ్గర కాలువ పొంగడంతో ఇడుపూరుకు రాకపోకలు నిలిచిపోయాయి, .

కూలిన ఇళ్లు :-

మొంథా తుఫాను తీవ్రతకు మార్కాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గృహాలు కూలిపో యాయి. భగత్సింగ్కలనీలోని తమ్మిశెట్టి తిరుపత య్య ఇల్లు, ఎస్టేట్లోని చల్లా సరస్వతి ఇల్లు వర్షం తీవ్రతకు కూలిపోవడంతో ఆస్తినష్టం జరిగింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్థంభించా యి. మార్కాపురం నుంచి నాగులవరం, తర్లుపాడు నుంచి బొడిచర్ల మధ్య ఉన్న గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ గ్రామాల మధ్య రాక పోకలు నిలిచిపోయాయి. బొడిచర్ల నుంచి చప్టాపై గుండ్లకమ్మ పొంగడంతో బొడిచర్ల, మాల్యవంతు నిపాడు గ్రామాల మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. మార్కాపురం చెరువులు కాలు వలు పొంగడంతో తిప్పాయిపాలెం, కొండేపల్లి, అమ్మవారిపల్లి, శివరాంపురం గ్రామాల్లోనికి వం దనీరు చేరింది. మార్కాపురం తహశీల్దార్ చిరంజీవి తోపాటు, పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది అందరూ ప్రొక్లైన్లద్వారా గుంతలు తవ్వి నీటిని మళ్లించారు. దరిమడుగు దగ్గర కాలువ పొంగ డంతో ఇడుపూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. బోడపాడులో వర్షపునీరు ఇళ్లలోనికి చేరడంతో ఆ గ్రామం సముద్రాన్ని తలపించేలా మారింది.

వైసీపీ నేత అన్నా పరామర్శ :-

మొంథా తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను, ముంపు ప్రాంతా లను మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ ఇన్చార్చి అన్నా రాంబాబు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ధైర్యాన్ని చెప్పారు.

సజ్జ పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర వెలిగండ్ల : మొంథా తుఫానుతో దెబ్బతిన్న సజ్జ పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ కనిగిరి నియోజకవర్గ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని రాళ్లపల్లి పంచాయతీ పూలికుంట్ల గ్రామంలో కల్లాల్లో ఉన్న కోతకోసిన సజ్జ పంట వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు దిబ్బమడుగు చిన్నగుంటయ్య, దిబ్బమడుగు పెద్దగుంటయ్య, అంగిరేకుల బాలయ్య, నప్పర్ల చిన్న అంకయ్యలు ఇంచార్జితో ఆవేదన వ్యక్తం చేశారు.సుమారు 100 క్వింటాళ్లకు పైగా సజ్జ బూజు పట్టి, మొలకెత్తి పనికిరాకుండా పోయినట్లు రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ మోంథా తుఫాను వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉండగా ప్రతి రైతుకి మేలు చేయాలి అనే ఉద్దేశంతో క్రాప్ ఇన్సూరెన్స్ అనేది ప్రభుత్వమే చెల్లించేది, అలాగే రైతు భరోసా కేంద్రాలలో ప్రతి రైతుకు కూడా ఏ పంట వెయ్యాలి ఏ పంట వేస్తే దిగుబడి వస్తుంది అధిక లాభం వస్తుందని చెప్పి రైతులని ఎడ్యుకేట్ చేసి రైతులను ఆదుకున్న ప్రభుత్వం

గత ప్రభుత్వమని ఆయన తెలపడం జరిగింది. మండల పార్టీ అధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి,కటికల వెంకటరత్నం, మాజీ సింగల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు,సైకం వెంకటేశ్వర్ రెడ్డి, కటుకూరి చిన్న పేరయ్య,దిబ్బమడుగు చిన్నగుంటయ్య, కొనతం లింగారెడ్డి ,ముక్కు వేణుగోపాల్ రెడ్డి,తాతపూడి నాని,రాయళ్ళ బ్రహ్మం, డోకుపర్తి సిద్దు, కటికల అశోక్, కేసరి వెంకటరెడ్డి, అంగిరే ంకుల బాలయ్య,కాకర్ల నాగయ్య,మర్రి వెంకట నారాయణ,రాయల అంజి ,శెట్టి శ్రీను,శెట్టి నాయుడు, మితికాల చిన్న బ్రహ్మయ్య, ఈర్ల తిరుపతయ్య,అంగిరేకుల బాలయ్య,కొణతం కేశవ రెడ్డి, మేడి బోయిన గురుకృష్ణ, మీతికల గురు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుడిపాడు- తొర్రగుడిపాడు మధ్య వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలంలో ఎర్రగుడిపాడు-తొర్రగుడిపాడు మధ్యగల వాగును పరిశీలించి ఇటీవల ఓ డైట్ కాలేజీ విద్యార్థి మృతి చెందిన సంఘటన గురించి అడిగి తెలుసుకుని ఇబ్బంది లేకుండా బ్రిడ్జిని నిర్మించాలని అధికారులు ఆదేశించారు. ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్. మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవ రావు,ఉప్పుగుండూరు నాగేశ్వరరావు చీమకుర్తి సీఐ దాసరి ప్రసాద్,బిసి సెల్ అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస రావు, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ ,తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-పామూరు : కారు బైకు ఢీ కొని తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన గురువారం పామూరు పట్టణ సమీపంలో 167బి జాతీయ రహదారిపై జరిగింది. కందుకూరు వైపు నుంచి ద్విచక్ర వాహనదారుడు రాంగ్ రూటులో వచ్చి పామూరు నుండి వస్తున్న కారును ఢీ కొట్టాడు.దీంతో కారు బైకు రోడ్డు పక్కకు దోసుకు వెళ్లాయి. స్థానికులు కారులో ఉన్న తండ్రీ, ఇద్దరు కుమార్తెలను బయటకి తీశారు. యువకుడు, మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి.

పంట నష్ట అంచనా వేయాలి

- కలెక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల పంట నష్టాలను అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని న్యూ వి.సీ హాల్‌లో తుఫాను ప్రభావంవల్ల దెబ్బతిన్న పంట నష్టాల అంచనాలు,కృష్ణా నది, నల్లమడ కాలువలు ప్రవాహం ఎక్కువగా ఉన్నందున తీసు కోవాల్సిన చర్యలపై అది, కారులతో కలెక్టర్ సమీ క్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న వ్యవసా య,ఉద్యానవన పంటల వివరాలను తయారు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణానది నుండి నీటి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్నందున భట్టిప్రోలు, కొల్లూరు ,రేపల్లె ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. రేపల్లె బట్టిప్రోలు,కొల్లూరు మండలాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పు నరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పొంగిపొర్లుతున్న నల్లమడ వాగు

తుఫాను ప్రభావం నేపథ్యంలో పొంగిపొర్లుతున్న నల్లమడ వాగు ప్రవాహ ఉధృతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు.గురువారం బాపట్ల జిల్లాలో ప్రవహిస్తున్న నల్లమడ వాగు ప్రవాహాన్ని,నల్లమడ వాగు ప్రవహిస్తున్న పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు.అప్పికట్ల రెవెన్యూ డివిజనల్ పరిధిలో ప్రవహిస్తున్న నల్లమడ వాగు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించి ప్రస్తుత నీటి ప్రవాహం గురించి డ్రైనేజీ అధికారులను ఆయన ఆరా తీశారు. నల్లమడ వాగులో 42 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవ హిస్తుందని,వరద ప్రవాహం నిలకడగా ఉందని డ్రైనేజీ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నల్లమడ వాగులోని వరదనీరు జిల్లెలమూడి గ్రా మానికి చేసినందున ఆ ప్రవాహాన్ని డ్రోన్లు ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలించారు.నీటి ఉధృతి ఎక్కువైతే జిల్లెలమూడి గ్రామం ముంపుకి గురవుతుందని ,గ్రామస్తులందరూ ముందస్తు చర్యలతో పునరావస కేంద్రంకు వెళ్లాలని ఆయన తెలిపారు. బాపట్ల మండల ప్రత్యేక,బీసీ సంక్షేమ శాఖ అధికారి శివ లీల,బాపట్ల డ్రైనేజీ డి.ఈ ధనలక్ష్మి,బాపట్ల తహ సీల్దార్ సలీమా,బాపట్ల ఇరిగేషన్ శాఖ అధికారులు,బాపట్ల ఎంపీడీవో పాల్గొన్నారు.

ప్రమాద స్థాయిలో నల్లమడ వాగు

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని జిల్లెలమూడి గ్రామం వద్ద నల్లమడ వాగు ప్రమాద స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తుంది.ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా మురుగునీరు నల్లమడ వాగు గుండ ప్రవహించడంతో మూలపాలెం ప్రాంతంలో మూడు చోట్ల కట్టలకు గండ్లు ఏర్పడిన పరిస్థితి నెలకొంది.వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని ఒక ప్రక్కన తుఫాన్ తీవ్ర వలన పంటలు పూర్తిగా నీట మునిగినా పరిస్థితి నెలకొందని రైతులు భయందో ళలన ఉన్నారు.అధికారులు అప్రమత్తమై కట్టలు బలోపేతానికి ఇసుక బస్తాలతో చర్యలు తీసుకుంటున్నారు.గురువారం వాగు కట్టలను బాపట్ల ఆర్డిఓ గ్లోరియా,తహసిల్దార్ సలీమా పరిశీలించారు.జిల్లా కలెక్టర్ అధికా రులను అనేక సార్లు ఆదేశించిన నిర్లక్ష్యంలో డ్రైనేజీ శాఖ అధికారులు గతంలో గండ్లు పడిన ప్రాంతాలను మరమత్తులు చేయకుండా వదిలి వేయడమే మరలా గండ్లు పడతానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు అని స్థానికులు అభిప్రాయం పడుతున్నారు.

బావిరెడ్డి ప్రభాకర్‌ని పరామర్శించిన జమలయ్య,సింగరకొండ

విశాలాంధ్ర - కొల్లూరు : కొల్లూరు మండలంలోని ఆవులు వారిపాలెం గ్రామంలో అనారోగ్యం కారణంగా బాధపడుతున్న సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రైతు సంఘం జిల్లా సీని యర్ నాయకులు బావిరెడ్డి ప్రభాకర్‌ను గురువారం ఏపీ రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య,సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పరామ ర్శించారు.ప్రభాకర్‌రావు త్వరగా కోలుకొని కోరారు.

వరద బాధితులకు సాయం

విశాలాంధ్ర-ఒంగోలు: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ప్రెసిడెంట్ నరేన్ కొడాలి,వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, కార్యదర్శి రాజా కసుకుర్తి సహకారంతో ఒంగోలు నగరంలో మంతా తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుచున్న దత్తాత్రేయ కాలనీ, బలరాం కాలనీలలో 600 మందికి భోజనం, అరటి పండ్లు, వాటర్ బాటిల్స్ అందచేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో, ఇబ్బందులు పడుచున్న వారికి మానవతా దృక్పథం తో తానా సహకారం తో ఈ రోజు న అన్నదానం చేయడం జరిగిందని, భవిష్యత్ లో వరదల్లో నిరాశ్రయులు అయిన వారికి ఎటువంటి సహాయం కావాలన్నా తమ సంస్థ ముందుంటుందని మురళీకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ సహనాజ్, కార్యదర్శి షేక్ సర్దార్ భాష, ట్రస్ట్ గౌరవ సలహాదారుడు మండవ సుబ్బారావు, జనసేవ శ్రీనివాస్, మేడిశెట్టి సుబ్బారావు, కల్లూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : మొంథా తుఫాను ప్రభావంతో మగ్గాల గుంటల్లో నీరుచేరి ఉపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు గత సంవత్సరం మంగళగిరిలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలులోని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు.తుఫాను ప్రభావంతో ఉపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు రూ.25 వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోలు బియ్యం,నిత్యావసర వస్తువులను అందించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగుడు సత్యనారా యణలు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో గత వారం రోజులుగా కురిసిన అధిక వర్షాల కారణంగా మగ్గాల గుంటల్లో నీరు చేరటంతో కార్మికులు ఉపాధిని కోల్పోయి ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం సహాయాన్ని అందించే వరకు చివరకు కార్మికులు ఐక్యంగా దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని బాలాజీ, సత్యనారాయణ పిలుపునిచ్చారు.ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల జీవితాలను మెరుగుపరిచేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేతన్నలను మోసం చేసిందని వారు ఆరోపించారు.గత ఏడాది అధిక వర్షాలు వలన ఉపాధిని కోల్పోయిన మంగళగిరిలోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన విధంగా ఆర్థిక సహాయంతో పాటు బియ్యం,నిత్యావసర వస్తువులను మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి అందించాలని బాలాజీ, సత్యనా రాయణలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు దీపాల సత్యనారాయణ,బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు,కె.వీర మోహన్ రావు,కౌవుతరపు పార్థసారథి,వంగర శ్రీనివాస రావు,ప్రజా సంఘాల నాయకులు పి.మనోజ్, జి.సుధాకర్, జి.నాగరాజు,చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా 'నిడమానూరి'

విశాలాంధ్ర-ఒంగోలు: మొంథా తుఫాను ఒంగోలు నగరంలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వివిధ ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చాలా కాలనీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర కాలనీ, జయ ప్రకాష్ కాలనీ, నేతాజీ కాలనీ చైతన్య కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. ఆ కాలనీలో పర్యటించిన బీజేపీ నాయకులు ప్రజలకు కావాల్సిన నిత్యావసరాలను పంచిపెట్టారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర సెల్స్ కో - కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ఆయా కాలనీల్లో పర్యటించి వరద బాధితులతో మాట్లాడి వారికి కావాల్సినవి అడిగి తెలుసుకున్నారు. మోకాలు లోతు వరద నీటిలోనే ప్రతి ఇంటికి వెళ్లి, అందరినీ పరామర్శించారు. అనంతరం డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలప్యాకెట్లు, మంచినీరు, ఆహారాన్ని అందించారు. చంటి పిల్లలతో ఇబ్బంది పడుతున్న వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రకాశం జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి వాళ్ల అవసరాలను తెలుసుకుని సాయం చేశారు. క్విస్ కళాశాల విద్యార్థులు సైతం ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు కల్యాణ్ చక్రవర్తి గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి అమర సింహం, అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, జిల్లా మాజీ అధ్యక్షులు పి.వి. కృష్ణారెడ్డి, యువ మోర్చ నాయకులు రాజేష్ వర్మ మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటల నష్టం అంచనాలు ప్రారంభం

విశాలాంధ్ర - మార్టూరు : తుఫాన్ కారణంగా మండలంలో నష్టపోయిన పంటల వివరాల నివేదికలను అధికారులు గురువారం ప్రా రంభించారు. మండల వ్యవసాయ అధికారి రామినేని లావణ్య,ఏ.ఆర్. ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ హరిత,డాట్ సెంటర్ కోఆర్డినేటర్ అచ్యు తరాజు,పెంటమాలజిస్ట్ డాక్టర్ వి.అనిల్ కు మార్‌లతో కలిసి మండలంలోని ద్రోణాదుల, బల్లి పల్లి గ్రామాలలో తుఫాను కారణంగా దెబ్బతిన్న మినుము,మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఏవో లావణ్య మాట్లాడుతూ పంటల నష్టం అంచనాలు స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రారంభించినట్లు తెలిపారు.పంటల నష్టం సంభవించిన రైతులందరూ రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి వారి భూములు,నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు.ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులు తమ పంటలు కనీసం 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితే తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఉద్యానవన పంటలకు సైతం నష్టాల అంచనాలు ప్రారంభం : మండలంలో ఉద్యానవన పంటలైన అరటి,బొప్పాయి,మిర్చి,కూరగాయల పంటలు సాగుచేసిన రైతులు పంటల నష్టం సంభవించిన వారు స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా తమ పంటల వివరాలు నమోదు చేసు కోవాలని ఉద్యానవన శాఖ అధికారి బి.హన ఎమంతు నాయక్ తెలిపారు.జొన్న తాళి గ్రామంలో మిర్చి పంటలను పరిశీలించిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడారు.ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులతోపాటు పంటల నమోదు చేసుకో ని రైతులు కూడా తమ పంటల నష్టం తాలూకు వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలని ఆయన తెలిపారు. ఈక్రాప్ బుకింగ్ చేసుకోకుండా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఆల్మండ్ అధికారుల ఆదేశానుసారం నష్టపరిహారం అందనున్నట్లు ఆయన తెలిపారు.